



## చాక్లెట్‌తో అయోధ్య రాముడి విగ్రహం

విశాఖ నగర పరిధిలోని గాజువాక శ్రీనగర్‌లో 89 అడుగుల వినాయక విగ్రహం చెంతనే చాక్లెట్‌తో రూపొందించిన అయోధ్య రాముడి విగ్రహం కూడా ఏర్పాటుచేస్తున్నారు. రెండు విగ్రహాలకు 23 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. - గాజువాక



## బెల్లం వినాయకుడు

జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల గాజువాక ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీఐఐసీకి చెందిన స్థలంలో స్థానిక లంబోదర ట్రస్ట్ నిర్వాహకులు 75 అడుగుల ఎత్తు, 24 అడుగుల వెడల్పు కలిగిన బెల్లం వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకు 20 టన్నుల బెల్లం వినియోగించారు. ఈ మండపాన్ని శుక్రవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ శంకబ్రతబాగ్చీ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం వద్ద బందోబస్తు ఎక్కువగా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. - మల్కాపురం

# మార్కెట్‌కు చవితి కళ

**కొనుగోలుదారులతో కిటకిట**

- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన ధరలు
- పత్రి రూ.20-30, కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):**

వినాయక చవితిని పురస్కరించుకుని నగర పరిధిలోని మార్కెట్లు శుక్రవారం కళకళలాడాయి. చవితి పూజ కోసం వినాయక ప్రతిమలు, పండ్లు, పూలతోపాటు ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు భారీగా మార్కెట్లకు తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు రైతుబజార్లతోపాటు పూర్ణామార్కెట్, అక్కయ్యపాలెం, అల్లిపురం, మద్దిలపాలెం, దొండపర్తి, మధురవాడ, వన్‌టౌన్, గోపాలపట్నం, కంచరపాలెం, గాజువాక, తదితర ప్రాంతాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గత ఏడాదితో పోలిస్తే పూజా సామగ్రి ధరలు పది నుంచి 20 శాతం మేర పెంచేశారు. పూజలో ... మిగతా 4వ పేజీలో



పూర్ణామార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

# మధ్య తరగతికి గృహ నిర్మాణం

**ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ**

- అనువైన ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి
- చెరువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం
- పంచాయతీల్లో అనధికార లేఅవుట్లకు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీని బాధ్యుడిని చేస్తాం
- తీర ప్రాంత రక్షణ పనులకు కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రయత్నం
- పీపీపీ విధానంలో ప్రాజెక్టులు
- 'ఆంధ్రజ్యోతి'తో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉందని, దానిని నిలబెట్టేలా లేఅవుట్లు, హౌసింగ్ ప్రాజెక్టులు చేపడతామని మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. హరిత హౌసింగ్ ప్రాజెక్టు తరువాత మళ్లీ గృహ నిర్మాణం చేపట్టలేదని, వాస్తవానికి వాటికి మంచి డిమాండ్ ఉందన్నారు. హరిత మాదిరి భారీగా కాకుండా అంతకంటే తక్కువ విస్తీర్ణంలో మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో కొన్ని ప్రాజెక్టులు చేపట్టాలనే యోచన ఉందన్నారు. గతంలో వేసిన లేఅవుట్లలో అనేక ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని వేలం ద్వారా విక్రయించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ముఖ్యంగా దాకమర్రి ఫార్చ్యూన్ లేఅవుట్ ప్లాట్లపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రాజెక్టు అయినా పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే చేపడతామని స్పష్టంచేశారు.



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

జీవీఎంసీ గణాంకాల ప్రకారం 215 చెరువులు ఉన్నాయని, వాటిని సంరక్షించేందుకు ప్రణాళిక రూపొందించామని, ప్రస్తుతం సర్వే జరుగుతున్నదని విశ్వనాథన్ చెప్పారు. వీటిని మూడు విభాగాలుగా విభజించి, పనులు ప్రారంభిస్తామన్నారు. వీఎంఆర్‌డీఏలో సిబ్బంది కొరత అధికంగా ఉందని, ప్లానింగ్ విభాగంలో డ్రాఫ్ట్‌మెన్లు, ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్ల సంఖ్య 30 శాతమే ఉందన్నారు. రిక్రూట్‌మెంట్ కోసం ప్రభుత్వానికి రాశామన్నారు. అంతవరకూ సచివాలయాల్లో పనిచేసే ప్లానింగ్ సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకొని అవసరమైన పనులు చేయిస్తున్నామన్నారు.

- అనధికార లేఅవుట్లను నియంత్రించడానికి పంచాయతీల్లో ప్రతి వారం ప్లానింగ్ సిబ్బంది పర్యటించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కొత్తగా అనధికార లేఅవుట్ వస్తే స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీని బాధ్యుడిని చేస్తామని హెచ్చరించామన్నారు. వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో అనధికార లేఅవుట్ల వివరాలు పెట్టామని, వాటిలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని సూచిస్తున్నామన్నారు. లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎవరి దగ్గర ఫైలు ఆలస్యం అయితే వారే జవాబు చెప్పాల్సి ఉంటుందని స్పష్టంచేశామన్నారు. షార్ట్ ఫాల్ నోటీసులు కూడా పదే పదే ఇచ్చేవారిని గుర్తించి హెచ్చరిస్తున్నామన్నారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం దగ్గర నుంచి ఎత్తేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జిని అనువైన ప్రాంతంలో ... మిగతా 4వ పేజీలో

# ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్

- టూనా చేపల ఎగుమతి కేంద్రంగా అండమాన్ దీవుల అభివృద్ధి
- కేంద్ర మత్స్య శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** భారతదేశాన్ని ఇంటర్నేషనల్ ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి సంబంధిత రంగాల నిపుణులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. టూనా చేపల ఎగుమతి కేంద్రం అండమాన్, లక్ష దీవులను అభివృద్ధి చేస్తామని, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని ... మిగతా 4వ పేజీలో



సమావేశంలో పాల్గొన్న కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, పక్కన కేంద్ర సహాయ మంత్రి కురియన్

## విమాన ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

- వార్త మెయిన్‌లో



విమానాశ్రయంలో డిజి యాత్ర సేవలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, అధికారులు ఉన్నారు

# మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు

- నాణ్యత విషయంలో రాజీ పడొద్దు
- శతశాతం విద్యార్థులు భోజనం చేసేలా చూడాలి
- విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):**

ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని విద్యాశాఖాధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులు, పలువురు హెచ్‌ఎంలు, పాఠశాలల యాజమాన్య కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీపడొద్దన్నారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ మేరకు భోజనం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని సూచించారు. సోమవారం అన్నం, కోడిగుడ్డు కూర, రసం, వేరుశనగ చిక్కీ, మంగళవారం పులిహోర, ఆలు కర్రీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ, బుధవారం వైట్ రైస్, కూరగాయల ముక్కలతో సాంబారు, ఉడికించిన గుడ్డు, రాగిజావ, గురువారం వెజిటిబుల్ రైస్, ఎగ్ కర్రీ (టమాటా, ఉల్లిపాయలతో కలిపి), శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ, శనివారం అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్ పెట్టాలని నిర్ణయించారు. మధ్యాహ్న భోజనం అమలును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కుక్‌లు మాట్లాడుతూ రాగిజావ తయారీ, గుడ్లు ఉడకబెట్టడానికి అయ్యే ఖర్చు మంజూరుచేయాలని కోరారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ టెండర్లలో అక్రమాలు

**జీవీఎంసీ అధికారుల ఇష్టారాజ్యం**

- భీమిలి జోన్‌లో మూడు ట్యాంకర్లతో నీటి సరఫరాకు టెండర్లు పిలిచిన సంబంధిత విభాగం
- ఎలాంటి పత్రాలు సమర్పించని కాంట్రాక్టర్‌కు బిడ్ ఖరారు
- నిబంధనలకు అధికారుల తిలోదకాలు
- ఇటీవల 2.5 కిలోలీటర్ల ట్యాంకర్‌తో నీటి సరఫరాకు రూ.18 లక్షలతో టెండర్ ఆహ్వానం
- ఫిర్యాదు అందడంతో పెండింగ్‌లో ఉంచిన ఉన్నతాధికారి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో అవినీతి పెచ్చుమీరుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ పనుల నిర్వహణ కోసం పిలిచే టెండర్లలో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజులు కిందట 2.5 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్‌తో నీటి సరఫరాకు రూ.9 లక్షలకు బదులు రూ.18 లక్షలతో టెండర్ పిలిచిన అధికారులు, తాజాగా భీమిలి జోన్‌లో మూడు ట్యాంకర్లతో నీటి సరఫరా కోసం పిలిచిన కాంట్రాక్టును నిబంధనలకు విరుద్ధంగా అస్మదీయుడైన కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు.

జీవీఎంసీలో నీటి సరఫరా విభాగం అత్యంత కీలకమైనది. అందుకే నిధుల కేటాయింపులో కూడా అధిక ప్రాధాన్యం ఉంటుంది. అయితే అంతటి ప్రాధాన్యం కలిగిన విభాగంలో కొంతమంది ఇంజనీరింగ్ అధికారులు జీవీఎంసీ ఖజానాకు నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. టెండర్ల కేటాయింపులో నిబంధనలను పక్కనపెట్టి అస్మదీయులైన వారికి పనులను కట్టబెడుతున్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనుల అంచనాలను భారీగా పెంచేస్తున్నారు. భీమిలి జోన్ పరిధిలో 2.5 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకర్లతోపాటు 1.5 కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన ఒక ట్యాంకర్‌తో నీటి సరఫరా కోసం టెండర్లు పిలిచారు. మూడు ట్యాంకర్లకు రూ.26 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. టెండరు వేసే కాంట్రాక్టర్ ట్యాంకర్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ), ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను కూడా కలిగి ఉండాలి. ఆయా పత్రాలను టెండర్‌తోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. టెండర్‌ల ప్రక్రియలో ముందు అధికారులు టెక్నికల్ బిడ్స్ పరిశీలిస్తారు. కాంట్రాక్టర్ అర్హతలు, వాహనాలకు సంబంధించిన పత్రాలు సరిగా ఉన్నాయో?, లేదో? తనిఖీ చేసి, అన్నీ నిబంధనలకు అనుగుణంగా ఉంటే తర్వాత ఫైనాన్షియల్ బిడ్స్ ఓపెన్ చేస్తారు. అందులో ఎవరు తక్కువకు కోట్ వేస్తే వారికి పని అప్పగించాలి. అయితే ఇక్కడే అధికారులు తమ పక్షపాతాన్ని చూపించారు. ట్యాంకర్లతో నీటి సరఫరాకు బిడ్ వేసిన ఒక కాంట్రాక్టర్‌కు సంబంధించిన వాహనాలకు పైన పేర్కొన్న పత్రాలు ఏమీ లేకపోవడంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదు. నిబంధనల ప్రకారం సదరు కాంట్రాక్టర్‌ను అధికారులు ఫైనాన్షియల్ బిడ్ తెరవకముందే పక్కనపెట్టి మిగిలిన వాటిని పరిశీలించాలి. అలా చేయకపోగా, అతనికే కాంట్రాక్టు అప్పగించారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని మిగిలిన కాంట్రాక్టర్లు నిర్ణయించారు. ఇదిలావుండగా కొద్దిరోజుల కిందట నగర పరిధిలో 2.5 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్‌తో నీటి సరఫరాకు రూ.తొమ్మిది లక్షలు అంచనాతో టెండర్ పిలిచారు. ఆ తర్వాత అంతే సామర్థ్యం కలిగిన మరొక ట్యాంకర్‌తో నీటి సరఫరాకు రూ.18 లక్షల వ్యయంతో టెండర్ పిలవడం ఇంజనీరింగ్ విభాగంలో ... మిగతా 4వ పేజీలో





కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ వద్ద రద్దీ



పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు



విద్యుత్ అలంకరణలో సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం

# గణనాథుని పూజకు సర్వం సిద్ధం

**సీతంపేట, సెప్టెంబరు 6 :** వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం రాత్రిసరికే చాలా ప్రాంతాల్లో మండపాలను రూపొందించి విద్యుత్ అలంకరణలు చేపట్టారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునే సీతంపేటలోని దుర్గా గణపతి ఆలయం సుందరంగా ముస్తాబైంది. ఇక్కడి యువత చొరవతో 32 ఏళ్ల కిందట విజయవాడ నుంచి దుర్గా గణపతి ప్రతిమను తెచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. నవరాత్రులూ రోజుకో ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిస్తారు. ఆలయ ప్రాంతం విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తోంది.

**అక్కయ్యపాలెం :** వినాయక చవితి పూజ సామగ్రి, కొనుగోలుదారులతో నరసింహనగర్ రైతుబజారు, అక్కయ్యపాలెం, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల మార్కెట్లు కిక్కిరిశాయి. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను, పూజ సామగ్రిని 'ద స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ, ఆత్మీయ కలయిక ఆధ్వర్యంలో నరసింహనగర్ రైతు బజారు ప్రాంతంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సంస్థల అధ్యక్షుడు వైసీహెచ్ దొరబాబు మాట్లాడుతూ తీర ప్రాంతంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీవిశ్వ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సభ్యులు ధర్మరాజు, సూర్యనారాయణ, లలిత శ్రీనివాస్, సత్యరాజు, స్వాతి, ప్రసాద్, సత్య, యామిని తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు, ఎంఎన్‌వీ విశ్వనాథం విద్యార్థులకు పర్యావరణ హిత వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు.

**మురళీనగర్ :** విశాఖ ఉత్తర నియోజకవర్గ మార్కెట్ ప్రాంతాలు రద్దీగా మారాయి. బిర్లా జంక్షన్, ఊర్వశి జంక్షన్, మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీల్లో వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కోసం జనం ఎగబడ్డారు. దరలు ఆకాశాన్నంటాయి. ప్రత్యేక పందిళ్లలో నిర్వాహకుల అభిరుచికి అనుగుణంగా ప్రత్యేక ఆకృతులలో విగ్రహాలు తయారు చేసి అలంకరిస్తున్నారు. రోడ్లన్నీ విద్యుత్తు దీపాలతో జిగేల్‌మంటున్నాయి.

**కంచరపాలెం :** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.వి.రమణ పిలుపునిచ్చారు. హైవే వెంచర్స్ సంస్థ సహకారంతో శుక్రవారం కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు.

**మహారాణిపేట :** టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మహారాణిపేటలో టీడీపీ కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు, వ్రత పుస్తకాలను పంపిణీ చేశారు.

**జ్ఞానాపురం :** కాన్వెంట్ కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద వైష్ణవి టోకు కాయగూరల వర్తకసంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు సంఘం కార్యదర్శి విల్లూరి పరమేశ్ తెలిపారు. ఉత్సవాలు ఈ నెల 21 వరకు జరుగుతాయన్నారు. విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**జగదాంబ కూడలి :** వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ 30 మంది జర్నలిస్ట్‌లకు వినాయక ప్రతిమలు, మిఠాయిలు పంపిణీ చేసింది.

**పూర్ణామార్కెట్ :** వినాయచవితి పూజా సామగ్రి విక్రయాల్లో వ్యాపారులు దోపిడీకి పాల్పడ్డారంటూ కొనుగోలుదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ కిటకిటలాడింది. వ్యాపారులు పూజా సామగ్రి ధరలు భారీ ఎత్తున పెంచి తమ జేబులు గుల్ల చేశారని కొనుగోలుదారులు వాపోయారు. మండప అలంకరణ, పల్లకిలకు భారీ డిమాండ్ ఏర్పడింది. పల్లకీలు రూ.500 నుంచి రూ.వెయ్యికి విక్రయించారు. వివిధ రకాల పండ్ల ధరలను అమాంతం పెంచేశారు. యాపిల్ జత రూ.100, దానిమ్మ ఒకటి 50, బత్తాయి జత చిన్నవి 100 వంతున విక్రయించారు. పూల ధరలకు రెక్కలొచ్చాయి. అనూహ్యంగా ధరలు పెంచేయడంతో పరిమితంగా కొనుగోలు చేశారు. పూర్ణామార్కెట్‌లో అన్నిరకాలు వస్తువులు అందుబాటులో ఉంటాయన్న ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పోటెత్తారు. మెయిన్ రోడ్డు నుంచి కురుపాం మార్కెట్ వరకు, దుర్గాలమ్మ గుడి రోడ్డు పూర్తిగా రద్దీగా మారాయి.



గాజువాకలో ఏర్పాటు చేస్తున్న 89 అడుగుల భారీ వినాయక విగ్రహం

## శిక్షల భయం లేకనే మహిళలపై అకృత్యాలు




సమావేశంలో మాట్లాడుతున్న పౌర చైతన్య వేదిక నాయకురాలు ప్రమీల

**సీతంపేట, సెప్టెంబరు 6:** కఠిన శిక్షలు పడతాయన్న భయం లేనందునే వయసు తారతమ్యం లేకుండా మహిళలపై అత్యాచారాలు, హత్యలకు ఒడిగడుతున్నారని పౌర చైతన్య వేదిక నాయకురాలు సీహెచ్ ప్రమీల ఆక్రోశించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రమీల మాట్లాడుతూ కోల్‌కత్తాలో జరిగినలాంటి దుస్సంఘటనలపై ప్రజలు సంఘటితమై పోరాడినప్పుడే నేరస్థులకు శిక్షలు పడే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రొఫెసర్ కోల వెన్ను మాట్లాడుతూ మహిళలపై అమానుష ఘటనలకు మద్యం, డ్రగ్స్, పోర్న్ సైట్స్, సినిమాలలో మితిమీరిన హింస చూపించడమే కారణమని ఆరోపించారు. యువత భయం వీడి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, పౌర చైతన్య వేదిక నాయకులు ఎస్.గోవిందరాజులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

**BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL**
At Visakhapatnam

O.A 321/2024

Between
The Maharaja Co-Operative Urban Bank Ltd.,
Represented by its General Manager,
Dwarakanagar Branch, Visakhapatnam.
APPLICANT
And
1.Mr.Kanumuri Venkata Rama Raju,(PAN No.AHXPK3891Q)
2.Mr.Kanumuri Srinivasa Raju,(PAN No.AHXPK3114B)
3.Mr.Kanumuri Subba Raju
DEFENDANTS
To
1.Sri Kanumuri Venkata Rama Raju,S/o. Subba Raju, Residing at D.No.50-97-13,SFS School Back Side, Seethammadhara,Visakhapatnam City,Visakhapatnam District, Andhra Pradesh - 530013 - (D1)
2.Sri Kanumuri Subba Raju,S/o late Kanumuri Ganga Raju, Residing at D.No.50-97-13,SFS School Back Side, Seethammadhara,Visakhapatnam City,Visakhapatnam District, Andhra Pradesh - 530013 - (D2)

**PAPER PUBLICATION SUMMONS**

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and financial institutions Act, 1993 [copy enclosed] against you for recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Honourable Tribunal at **10:30 A.M** or at such time immediately thereafter according to the convenience of the tribunal on **27-09-2024** to answer the claim.

You are directed to collect the OA Book on you Appearance before the Tribunal. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.Take notice that, in case of default, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

**Given under my hand and the seal of the Tribunal, on this the 02nd September, 2024 at Visakhapatnam.**

Sd/-
Authorised to issue summons
DEBT RECOVERY TRIBUNAL
Visakhapatnam



# నీరు-చెట్టు బకాయిలు విడుదల

**ప్రస్తుతం రూ.3.49 కోట్లు విడుదల, కోర్టుకు వెళ్లిన వారికి తొలి ప్రాధాన్యం**

**2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో రూ.44.5 కోట్లతో 715 పనులకు బిల్లులు**

**పెండింగ్‌లో పెట్టిన వైసీపీ సర్కారు కూటమి ప్రభుత్వం రాకతో మంజూరు**

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం ప్రభుత్వ హయాం(2014-2019)లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం తాజాగా రూ.3,49,67,926 మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బిల్లుల కోసం కోర్టుకు వెళ్లిన వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. కోర్టుకు వెళ్లినా గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కొందరు హైకోర్టులో ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు ధిక్కారణ పిటిషన్లు వేసిన వారికి తొలుత బిల్లులు ఇవ్వాలని, తదుపరి కోర్టును ఆశ్రయించిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా చోడవరం కేంద్రంగా పనిచేస్తున్న వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ డివిజన్‌లో 15 పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఏడుగురికి రూ.1,13,28,113, కోర్టును ఆశ్రయించిన మరో ఐదుగురికి రూ.37,26,309 విడుదల చేశారు. అలాగే నర్సీపట్నం రెగ్యులర్ డివిజన్ పరిధిలో 19 పనులకు కోర్టు ధిక్కారణ పిటిషన్లు చేసిన ఎనిమిది మందికి రూ.1,50,54,422, పాడేరు చిన్ననీటి పారుదల డివిజన్ పరిధిలో రెండు పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఇద్దరికి రూ.27,57,533 విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో నీరు-చెట్టు కింద 2019 వరకు రూ.44.5 కోట్ల విలువైన 715 పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు బిల్లులు ఇవ్వలేదు సరికదా రెండు, మూడు పర్యాయాలు విచారణ చేపట్టింది. ఆ తరువాత కూడా బిల్లుల విషయం తేల్చకపోవడంతో పలువురు కోర్టుకు వెళ్లారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారిలో ఎక్కువ మంది కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 89 పనులకు రూ.7.7 కోట్లు విడుదల చేసినా సీఎంఎఫ్ఎస్‌లో బిల్లులు పూర్తిగా రాలేదని చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల విషయం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అన్ని జిల్లాలకు కలిపి రూ.200 కోట్లు విడుదల చేయగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 41 పనులకు రూ.3.49 కోట్లు మంజూరుచేశారు. త్వరలో సొమ్ములు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాకు జమ కానున్నాయి. మిగిలిన పనులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

## శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో ప్రత్యేక రైళ్లకు హాల్ట్

**విశాఖపట్నం, సెప్టెంబరు 6:** ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, తంబరం-సంత్రాగచ్చి మధ్య ప్రవేశపెడుతున్న ప్రత్యేక రైళ్లకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో రెండు నిమిషాలపాటు హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06089 నంబరు గల చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి రైలు ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో 06090 నంబరు గల సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ రైలు మధ్యాహ్నం 2.05 గంటలకు, 06095 నంబరు గల తంబరం-సంత్రాగచ్చి రైలు ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి-తంబరం రైలు మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌కు చేరుతాయని పేర్కొన్నారు. దువ్వాడ మీదుగా హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను యశ్వంతపూర్ వరకు పొడిగించామన్నారు. ఈ నెల 25 నుంచి హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ (22831/22832) సర్వీసులుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

## వినాయక పందిళ్లకు 44 దరఖాస్తులు

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** నగరంలో వినాయక చవితి పందిళ్లకు అనుమతి కోసం ఆఫ్‌లైన్‌లో శుక్రవారం 44 దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఛాంబర్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 వరకు దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను పోలీస్ కమిషనరేట్‌కు పంపిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆఫ్‌లైన్‌లో గతనెల 27 నుంచి ఈనెల 3వ తేదీ వరకు 111 దరఖాస్తులు రాగా కమిషనరేట్‌కు పంపారు. తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ సరిగ్గా పనిచేయకపోవడం, ఇతరత్రా ఇబ్బందులు ఉండడంతో గురువారం నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తం 194 దరఖాస్తులు వచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.




పోలీసులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

## కేజీహెచ్‌లో నగర పోలీసులకు వైద్య పరీక్షలు

**మహారాణిపేట, సెప్టెంబరు 6:** పోలీసు సిబ్బందికి కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. సీపీ శంకబ్రత బాగ్చి ఆధ్వర్యంలో శుక్రవారం కేజీహెచ్‌లో సుమా రు 3,500 మంది నగర పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ నెల 10 వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలు ఉంటే చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. మద్య వ్యసనానికి అలవాటు పడిన కొందరు హోంగార్డులకు డి ఆడిక్షన్ సెంటరు ద్వారా చికిత్స చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## మార్కెట్‌కు చవితి కళ

... 3వ పేజీ తరువాయి

వినియోగించే పత్రి రూ.20-30, కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50, అరటి పండ్లు డజను రూ.80కు విక్రయించారు. పూజ కోసం ప్రత్యేకంగా కొనుగోలు చేసే ఎలక్కాయ, సీతాఫలం వంటివి ఒక్కొక్కటి రూ.పది నుంచి రూ.30 చొప్పున విక్రయించారు. ఇంట్లో పూజకు వినియోగించే చిన్న సైజు వినాయక మట్టి ప్రతిమలు రూ.50 నుంచి రూ.250, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు రూ.200 నుంచి రూ.500 మధ్య విక్రయాలు సాగించారు. కొన్నిచోట్ల పూజకు అవసరమైన సామగ్రి మొత్తాన్ని సెట్‌గా రూ.350 నుంచి రూ.500కు ఇచ్చారు. గతంతో పోలిస్తే ఇంట్లో వినియోగించే చిన్నపాటి విగ్రహాల విక్రయాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో 100 నుంచి 150 బొమ్మలు విక్రయిస్తే, ఈ ఏడాది గురు, శుక్రవారాల్లో 200కుపైగా విక్రయించినట్టు రామారావు అనే వ్యాపారి తెలిపారు. మరో 100 వరకు బొమ్మలు అమ్ముడుపోతాయని తెలిపారు.

## మధ్య తరగతికి గృహ నిర్మాణం

... 3వ పేజీ తరువాయి

ఏర్పాటుచేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణులతో అధ్యయనం చేయిస్తున్నామని, వారు సూచించిన ప్రాంతంలో దానిని ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి నిధులు రాబట్టుకునే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని పురపాలక శాఖా మంత్రి సూచించిన నేపథ్యంలో కోతకు గురవుతున్న తీర ప్రాంతాన్ని సంరక్షించుకోవడానికి రూ.200 కోట్లు కోరుతూ కేంద్రానికి లేఖ రాశామన్నారు. అయితే ఇప్పటికే ఇదే పథకం కింద ఉప్పాడ తీరానికి నిధులు మంజూరు చేశామని, రెండో దశలో విశాఖకు ఇస్తామని సమాధానం వచ్చిందన్నారు.

## ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్

... 3వ పేజీ తరువాయి

చెప్పారు. లక్ష్య సాధన కోసం ఫిషరీస్ రంగాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. రొయ్యల ఎగుమతులు మరింత పెంచడానికి న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్లపై దృష్టిపెట్టామని, వీటి కోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఐదు రోజుల క్రితమే 218 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామన్నారు. మత్స్య రంగానికి గత ఏడాది కంటే ఈ ఏడాది 54 శాతం అధికంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. ఒక్క పీఎంఎస్ఎస్‌వై కిందే ఈ ఏడాది రూ.2,352 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. సమావేశంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఇలియాస్, అధ్యక్షులు రవికుమార్ ఎల్లంకి, ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పీఆర్ మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## 'అవకాశాలను సద్వినియోగం చేసుకోండి'

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 :** విశాఖ పోర్టు అథారిటీ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా ఇచ్చిన నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన 4, 5 బ్యాచ్‌ల విద్యార్థుల్లో ఉద్యోగాలు పొందిన వారికి శుక్రవారం ఆయన పోర్టు పరిపాలనా భవనం మంథన్ మందిరంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్‌లుగా పలువురు విద్యార్థులు చెన్నై, హైదరాబాద్‌లో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఉద్యోగాలు పొందడం పట్ల సెమ్స్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ, సెమ్స్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రేటర్ టెండర్లలో అక్రమాలు

... 3వ పేజీ తరువాయి

చర్చనీయాంశంగా మారింది. ఒకే రకమైన పనికి ఒకే ఖర్చుతో టెండర్ పిలవాల్సిన అధికారులు, రెట్టింపు వ్యయంతో టెండర్ పిలవడం ఏమిటనే దానిపై చర్చ జరిగింది.విషయం ఉన్నతాధికారి దృష్టికి చేరడంతో టెండర్ ప్రక్రియను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. నీటి సరఫరా విభాగంలో ఇలాంటి అవకతవకలు బోలెడు జరుగుతున్నాయి. వీటిపై జీవీఎంసీ కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంది.



డాబా గార్డెన్స్‌లో ఎస్‌టీయూ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయుడ్ని సన్మానించారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

## 10న ఉక్కు పరిరక్షణ రాస్తారోకో

**జగదాంబ కూడలి, సెప్టెంబరు 6 :** ఉక్కు పరిరక్షణ కోసం 10న జిల్లాలో సిటు ఆధ్వర్యంలో పలుచోట్ల రాస్తారోకోలు తలపెట్టినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ వెల్లడించారు. శుక్రవారం జగదాంబ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కుకు సొంత బొగ్గు గనులు కేటాయించాలని కోరుతూ పోరాట కమిటీ 10న ఉదయం 10 గంటల నుంచి 11 వరకు రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపు ఇచ్చిందన్నారు.

## 'ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం'



సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ కన్వీనర్ నరసింగరావు

**గాజువాక, సెప్టెంబరు 6:** ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి కార్డులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మూడు రోజుల్లోనే కోటి మంది స భ్యత్వం తీసుకున్నారన్నారు. గాజువాకలో లక్ష మందికి సభ్యత్వ నమోదు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వి.రోహిణి, ప్రకాష్, శంకరరావు, నాగేశ్వరరావు, యువశ్రీ, బొత్స దిలీప్, పేర్ల అప్పారావు, జగదీష్ పాల్గొన్నారు.

## దువ్వాడ సీఐగా మల్లేశ్వరరావు

**కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6:** దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐగా కె.మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరిస్తానని, శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. గంజాయి, ఈవ్‌టీజింగ్ తదితర వాటిని దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా సీఐను టీడీపీ 86 వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నా యకులు వేగుంట శ్రీనివాస్, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

**అగనంపూడి:** దువ్వాడ స్టేషన్‌కు సీఐగా బాధ్యతలు స్వీకరించిన మల్లేశ్వరరావును స్థానిక కూటమి నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, బుదిరెడ్డి అప్పారావు, వద్దాది శ్రీను, బండారు చందు రమేష్ పాల్గొన్నారు.

## ఆర్మీ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్



వైద్య పరీక్ష కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులు

**మల్కాపురం, సెప్టెంబరు 6 :** ఇండియన్ నేవీ, ఆర్మీల ఉద్యోగాలకు అర్హత పొందేందుకు పారిశ్రామిక ప్రాంత పరిధి ఐఎస్ఎస్ కళ్యాణి ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మెడికల్ టెస్ట్‌లకు ఆయా అభ్యర్థులు శుక్రవారం పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవల మెడికల్‌లో అర్హత పొందినా, మరోసారి రీ మెడికల్ పేరుతో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలలో అర్హత పొందితే ఉద్యోగం వచ్చినట్టే. ఈ పరీక్షలకు రెండు తెలుగురాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా అభ్యర్థులు తరలివచ్చారు. పెద్దఎత్తున అభ్యర్థుల రాకతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

# మార్కెట్‌కు వినాయక చవితి సందడి



కొత్తగాజువాకలో మార్కెట్‌లో రద్దీ



కిటకిటలాడుతున్న గోపాలపట్నం రోడ్డు



కూర్మన్నపాలెంలో ప్రతిమల విక్రయం

- కొనుగోలుదారులతో కొత్తగాజువాక రద్దీ
- చుక్కలనంటిన పూజా సామగ్రి ధరలు

**గాజువాక, సెప్టెంబరు 6:** గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలుదారులతో కొత్తగాజువాక ప్రధాన మార్కెట్ శుక్రవారం కిటకిటలాడింది. ఉదయం నుంచి కొనుగోలుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజకు అవసరమయ్యే విగ్రహాలు, పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేశారు.

ఈ సందర్భంగా విగ్రహాలనుంచి పండ్లు, పూలు, ఇతరపూజా సామగ్రి ధరలు చుక్కలనంటాయి. కొబ్బరికాయ రూ. 60 నుంచి రూ. 70 , అరటిపండ్లు పెద్ద రూ.130 నుంచి 150, వినాయక విగ్రహం రూ. 300 ఆపై ధరకు విక్రయించారు. నిత్యం లభించే పత్రి, మామిడాకులను సైతం అధిక ధరకు విక్రయించారు.

### ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

కొత్తగాజువాక కొనుగోలుదారులతో రద్దీగా మారి రోడ్లు మూసుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

**కూర్మన్నపాలెం:** వినాయక చవితి నేపథ్యంలో ఆటోనగర్, కూర్మన్నపాలెం, శ్రీనగర్, దువ్వాడ మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. పూజా సామగ్రి, పండ్లు, పత్రితో పాటు విగ్రహాలు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. రోడ్లపై దుకాణాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

**మల్కాపురం:** మల్కాపురం, శ్రీహరిపురం మార్కెట్‌లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

**గోపాలపట్నం:** ప్రధాన రహదారిలోని గోపాలపట్నం కూడలిరైతుబజారు ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్డు బజారు ప్రాంగణం శనివారం కిక్కిరిసి పోయాయి. ఉదయం నుంచి బజారుల్లో పూజాసామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి.

## మట్టి గణపతిని పూజిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6:** పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలను పూజించాలని మాజీ మునిసిపల్ ఛైర్మన్ వీఏఎస్ఎం రాజా, లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ అధ్యక్షుడు మురళీధరరెడ్డి, టీడీపీ 86 వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్య నారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏ ప్లస్ ఆసుపత్రి ప్రాంగణంలో 1000 మందికి వినాయక మట్టి విగ్రహాల పంపిణీలో వారుపాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కె.వి. సుబ్బరాజు, కె.వి. ప్రసాద్, అవిరెడ్డి సూర్య నారాయణ పాల్గొన్నారు.

### మట్టి ప్రతిమల పంపిణీ

**పెందుర్తిరూరల్:** పెందుర్తి మండల జనసేన నాయకుడు కర్రి శివ ఆధ్వర్యంలో శుక్రవారం చింతలఅగ్రహారం, గవరపాలెం కాలనీలలో ఉచితంగా గణపతి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుల్ల ఆదేశాలపై గ్రామాలలో ఉచితంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేశామన్నారు.

**ఉక్కుటౌన్‌షిప్:** స్టీల్‌ప్లాంట్ సృష్టి స్కూల్‌లో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పర్యావరణ హితంగా విగ్రహాలను తయారు చేసి పంపిణీతో పాటు స్కూల్‌లో మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుశీలరాణి, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పెందుర్తి:** పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్



విగ్రహాలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 300 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఈ ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. సిరమల్లె గణేశ్, కందుల నవీన్, రాజాపు రాజారావు పాల్గొన్నారు.

**వేపగుంట:** 98వ వార్డు విశాఖపట్నం రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వసుదేవా ఫంక్షన్ హాల్ వద్ద మట్టి వినాయకులు పంపిణీ నిర్వహించారు. 2వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రమణ తెలిపారు. సభ్యులు నైనరసింగరావు, త్రినాథ సాహు పాల్గొన్నారు.

**కూర్మన్నపాలెం:** మట్టి విగ్రహాలను పూజించి ప్రకృతిని పరిరక్షించాలని జెడ్‌సీ సన్యాసినాయుడు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87 వార్డు తిరుమలనగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చే శారు.

**పెదగంట్యాడ:** స్థానిక టీడీపీ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలను 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నామాల శ్రీకాంత్, నీలాపు అప్పలరెడ్డి, మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

**అక్కిరెడ్డిపాలెం:** 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి నాతయ్యపాలెంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీలో పాల్గొన్నారు. ఎఎస్ సాంబమూర్తిరాజు, గోపిశెట్టి దేముడు, సంగ్రాన వరహాలురాజు, జి నరసింగరావు తదితరులు 200 వినాయక ప్రతిమలను పంపిణీచేశారు... షీలానగర్ ఆటోస ర్వీస్ సెంటర్ వద్ద గ్లో ఆధ్వర్యంలో గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వై రవి, శ్రావణ్ శ్రీహర్ష పాల్గొన్నారు. చినగంట్యాడలో వైసీపీ నేత గుడివాడ లతీష్ మట్టి ప్రతిమలు పంపిణీచేశారు. షీలానగర్‌లో గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో మద్దాల శ్రీనివాసరావు, పి ఉమామహేశ్వరరావు, మల్ల సురేష్ విగ్రహాలు పంపిణీచేశారు.

**కూర్మన్నపాలెం:** వినాయక ఉత్సవాలను ప్రజలు పర్యావరణ హితంగా జరపాలని తిరుమల నగర్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం సూచించారు. జీవీఎంసీ 87 వార్డులో శుక్రవారం కాలనీ సామాజిక భవనం వద్ద చవితి ఉత్సవ రాటను వేశారు. పరమేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు పాల్గొన్నారు.

## విరిగిపడిన మట్టిపెళ్లలు



లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్ కొండవాలులో పడిన మట్టి పెళ్లలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

**ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 6:** గ్రేటర్ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని కొండవాలు ప్రాంతంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ నడక మార్గంలో ఆ సమయంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ లేకపోవడంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. దీంతో కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వార్డు అధ్యక్షు డు ఎలమంచిలి ప్రసాద్, మాణిక్యం, గౌరీశ్, ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### గ్రంథాలయం ప్రారంభం

**ఎన్.ఎ.డి.జంక్షన్:** బుచ్చిరాజుపాలెం గాంధీనగర్‌లో జీవీఎంసీ నిధులు రూ.10లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. జోన్- 8 ఈఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, టీడీపీ నాయకులు ప్రసాద్, నరవ పైడిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంటుకు బొగ్గు తక్షణమే ఇవ్వాలి

- గంగవరం పోర్టు ప్రధాన గేటు ఎదుట ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ నేత అయోధ్యరామ్

**ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 6:** స్టీల్ ప్లాంట్‌కు చెందిన కోల్‌ను తక్షణమే గంగవరం పోర్టు విడుదల చేయాలని స్టీల్ ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గంగవరం పోర్టు ప్రధానగేటు ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాం ట్ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఈ సమయంలో కోల్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు కోల్ చేరకుండా అదాని పోర్టు అడ్డుపడడం దుర్మార్గమన్నారు. ప్లాంట్ భూముల్లో నిర్మించిన గంగవరం పోర్టు నేడు ఉక్కు కర్మాగారాన్నే ఇబ్బందుల పాలు చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం, పాలకులు చొరవ తీసుకొని స్టీల్‌ప్లాంట్‌కు కోల్ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాసు, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పుల్లారావు, నీలకంఠం, వి.ప్రసాద్, మురళీ, శ్రీనివాస్, రెడ్డి, రామన్న, నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

## వరద బాధితులకు పారిశ్రామికవేత్తల సాయం

**ఆటోనగర్, సెప్టెంబరు 6:** ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు విజయవాడ వరద ముంపు బాధితులకు మరోమారు సాయం అందించి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా ఆటోనగర్ నుంచి లారీలో 3 వేలు మిక్చర్ ప్యాకెట్లు, 15 వేల రొట్టెలను తరలించారు. వాసీవా, ఐలా, పైవా సంయుక్త ఆధ్వర్యంలో ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు సజ్జా పాండురంగ ప్రసాద్, చీకటి సత్యనారాయణ, రామ ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, ఈ.కృష్ణప్రసాద్, అట్లూరి రమేష్, యార్లగడ్డ సాంబశివరావు, దామినేని శ్రీనివాస్, కొల్లి ఈశ్వరరావు, రామభద్రరాజు పాల్గొన్నారు.




వ్యానును ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్తలు





## ప్రత్యేక కార్గో విమానాలు నడపండి

- కేంద్ర మంత్రికి అపాటా వినతి

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** విశాఖ విమానాశ్రయం నుంచి ప్రత్యేక కార్గో విమాన సర్వీసులు నడపాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ (అపాటా) ఆ శాఖ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కోరింది. ఈమేరకు అపాటా ప్రతినిధులు కె. కుమార్ రాజా, ఓ. నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ శుక్రవారం ఇక్కడి విమానాశ్రయంలోని ప్రత్యేక కార్యక్రమంలో మంత్రిని కలిసి మాట్లాడారు. నైట్ పార్కింగ్ అందుబాటులోకి తేవాలని, గతంలో నడిచి రద్దయిన విమానాలను పునరుద్ధరించాలని కోరారు. అలాగే విశాఖ-భోగాపురం మధ్య 12 ఫ్లైఓవర్లు మంజూరయ్యాయని, బీచ్ కారిడార్ కూడా మంజూరైందని వాటి పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. అరకు కాఫీని ప్రమోట్‌కు అన్ని విమానాశ్రయాల్లో అరకు కాఫీ కౌంటర్లు పెట్టించాలన్నారు. అనంతరం విజయవాడలో వరద బాధితులకు 50 వేల బిస్కెట్ ప్యాకెట్లను అపాటా ప్రతినిధులు పంపించారు. వాటికి సంబంధించిన పత్రాలను మంత్రికి అందజేశారు.




కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి వినతి పత్రమిస్తున్న అపాటా ప్రతినిధులు

## చినముషిడివాడలో ఆక్రమణలపై విచారణ

**పెందుర్తి, సెప్టెంబరు 6:** చినముషిడివాడ సర్వే నంబర్ 185లో ఆక్రమణలపై రెవెన్యూ సమగ్ర విచారణ చేపట్టింది. ఇక్కడి బర్డన్‌నగర్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్ర మించి పాకలు వేశారు. ఈ క్రమంలో దళారులురంగంలోకి దిగి ఆక్రమించిన స్థలాల్లో పాకల స్థానంలో షెడ్లు నిర్మించేందుకు రూ. 3 నుంచి రూ. 5 లక్షలకు వసూలు చేస్తున్నారు. వారు అడిగిన సొమ్ము ఇవ్వలేదని కక్ష గట్టిన కొంతమంది ఇదే ప్రాంతంలో నివసిస్తున్న అత్తిలి శ్రీనివాసరావు నిర్మించుకున్న షెడ్‌ను కూల్చివేశారు. దీంతో శ్రీనివాసరావు తన కుటుంబంపై దాడికి పాల్పడి షెడ్‌ను కూల్చేశారంటూ సచివాలయ మహిళా వీఆర్వో సహకారంతో గురువారం తహసీల్దార్, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం తహసీల్దార్ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు.



బర్డన్‌నగర్‌లో షెడ్ల తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

## చోరీ కేసులో నిందితుడు అరెస్టు

**గాజువాక, సెప్టెంబరు 6:** గాజువాక ప్రాంతంలో ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని గాజువాక పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాకలో ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఈ నెల మూడో తేదీన ఫిర్యాదు అందటంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గాజువాక సుందరయ్యకాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లారెడ్డి వెంకటేష్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

## ఘనంగా నేత్ర దాన పక్షోత్సవాలు

**అగనంపూడి, సెప్టెంబరు 6:** స్థానిక ఏరియా ఆస్పత్రిలోని కంటి వైద్య విభాగం ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా నేత్ర దాన అవశ్యకతను వివరించారు. కంటి వైద్య నిపుణురాలు ఆశ , వైద్యులు గోపికృష్ణ, ఉష, లలిత, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సీజీఎం దృష్టికి కార్మిక సమస్యలు

**ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 6:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌ను డీవీఆర్‌ఈఎస్‌యూ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణారెడ్డి నేతృత్వంలో నాయకులు కోరారు. వర్క్స్ సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గల్లా శంకర్‌సాయిరాం, పేర్ల నూకరాజు, గొందేశి అప్పారావు, త్రినాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిప్పల గురునాథ్‌రెడ్డి, పితాని శ్రీను పాల్గొన్నారు.

## 'హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి'

**మల్కాపురం, సెప్టెంబరు 6 :** హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న సబ్ కాంట్రాక్టర్ కన్‌కార్డు ఇంజనీరింగ్ ప్రైవేటు లిమిటెడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీవో రేటు ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇంటక్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బో గవిల్లి నాగభూషణం పాల్గొని మాట్లాడారు. కార్మికులతో రోజుకు ఎనిమిది గంటలకు మించి పనిచేయించుకుంటున్నారన్నారు.

### ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

**ఉక్కుటౌన్‌షిప్:** ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్ ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ నెల మూడో తేదీన బిలాయ్‌లో జరిగిన సమావేశాల వివరాలను వివరించారు. కార్యక్రమంలో అమ్మిరెడ్డి, రాములు, నాయుడు, గోపాల్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

**అగనంపూడి, సెప్టెంబరు 6:** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక శనివాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాలు రిశీలించారు.

## రుషికొండలో సినిమా షూటింగ్

**సాగర్‌నగర్, సెప్టెంబరు 6 :** నారా రోహిత్ హీరోగా తెరకెక్కుతున్న సుందరాకాండ సినిమా షూటింగ్ శుక్రవారం రుషికొండలోని గీతం వర్సిటీ ఆవరణలో జరిగింది. సందీప్ పిక్చర్స్ ప్యాలెస్ పతాకంపై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరోయిన్‌గా శ్రీదేవి నటిస్తుండగా సంతోష్, గౌతమ్‌రెడ్డి నిర్మాతలు.

## వరద బాధితులకు విరాళాల సేకరణ

**మల్కాపురం/ గాజువాక, సెప్టెంబరు 6:** విజయవాడ వరద బాధితుల ఆదుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాపురం, గాజువాకల్లో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, నాయకులు వెంకట్, వై.కనకేశ్వరరావు, రంగే అప్పారావు, కె.పోతన్న, అచ్చుతరావు, విష్ణుమూర్తి, వనజాక్షి పాల్గొన్నారు.

## నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

**అగనంపూడి, సెప్టెంబరు 6:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలోని సిబ్బంది ఆందోళన చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని కలిసి తమ సమస్యను వివరించారు.


కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ వద్ద రద్దీ


పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు


విద్యుత్ అలంకరణలో సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం

# గణనాథుని పూజకు సర్వం సిద్ధం

**సీతంపేట, సెప్టెంబరు 6 :** వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం రాత్రిసరికే చాలా ప్రాంతాల్లో మండపాలను రూపొందించి విద్యుత్ అలంకరణలు చేపట్టారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునే సీతంపేటలోని దుర్గా గణపతి ఆలయం సుందరంగా ముస్తాబైంది. ఇక్కడి యువత చొరవతో 32 ఏళ్ల కిందట విజయవాడ నుంచి దుర్గా గణపతి ప్రతిమను తెచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. నవరాత్రులూ రోజుకో ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిస్తారు. ఆలయ ప్రాంతం విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తోంది.

**అక్కయ్యపాలెం :** వినాయక చవితి పూజ సామగ్రి, కొనుగోలుదారులతో నరసింహనగర్ రైతుబజారు, అక్కయ్యపాలెం, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల మార్కెట్లు కిక్కిరిశాయి. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను, పూజ సామగ్రిని 'ద స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ, ఆత్మీయ కలయిక' ఆధ్వర్యంలో నరసింహనగర్ రైతు బజారు ప్రాంతంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సంస్థల అధ్యక్షుడు వైసీహెచ్ దొరబాబు మాట్లాడుతూ తీర ప్రాంతంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీవిశ్వ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సభ్యులు ధర్మరాజు, సూర్యనారాయణ, లలిత శ్రీనివాస్, సత్యరాజు, స్వాతి, ప్రసాద్, సత్య, యామిని తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు, ఎంఎస్‌వీ విశ్వనాథం విద్యార్థులకు పర్యావరణ హిత వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు.

**మురళీనగర్ :** విశాఖ ఉత్తర నియోజకవర్గ మార్కెట్ ప్రాంతాలు రద్దీగా మారాయి. బిర్లా జంక్షన్, ఊర్వశి జంక్షన్, మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీల్లో వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కోసం జనం ఎగబడ్డారు. దరలు ఆకాశాన్నంటాయి. ప్రత్యేక పందిళ్లలో నిర్వాహకుల అభిరుచికి అనుగుణంగా ప్రత్యేక ఆకృతులలో విగ్రహాలు తయారు చేసి అలంకరిస్తున్నారు. రోడ్లన్నీ విద్యుత్తు దీపాలతో జిగేల్‌మంటున్నాయి.

**కంచరపాలెం :** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.వి.రమణ పిలుపునిచ్చారు. హైవే వెంచర్స్ సంస్థ సహకారంతో శుక్రవారం కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు.

**మహారాణిపేట :** టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మహారాణిపేటలో టీడీపీ కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు, వ్రత పుస్తకాలను పంపిణీ చేశారు.

**జ్ఞానాపురం :** కాన్వెంట్ కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద వైష్ణవి టోకు కాయగూరల వర్తకసంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు సంఘం కార్యదర్శి విల్లూరి పరమేశ్ తెలిపారు. ఉత్సవాలు ఈ నెల 21 వరకు జరుగుతాయన్నారు. విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**జగదాంబ కూడలి :** వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోషియేషన్ 30 మంది జర్నలిస్టులకు వినాయక ప్రతిమలు, మిఠాయిలు పంపిణీ చేసింది.

**పూర్ణామార్కెట్ :** వినాయచవితి పూజా సామగ్రి విక్రయాల్లో వ్యాపారులు దోపిడీకి పాల్పడ్డారంటూ కొనుగోలుదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ కిటకిటలాడింది. వ్యాపారులు పూజా సామగ్రి ధరలు భారీ ఎత్తున పెంచి తమ జేబులు గుల్ల చేశారని కొనుగోలుదారులు వాపోయారు. మండప అలంకరణ, పల్లకిలకు భారీ డిమాండ్ ఏర్పడింది. పల్లకీలు రూ.500 నుంచి రూ.వెయ్యికి విక్రయించారు. వివిధ రకాల పండ్ల ధరలను అమాంతం పెంచేశారు. యాపిల్ జత రూ.100, దానిమ్మ ఒకటి 50, బత్తాయి జత చిన్నవి 100 వంతున విక్రయించారు. పూల ధరలకు రెక్కలొచ్చాయి. అనూహ్యంగా ధరలు పెంచేయడంతో పరిమితంగా కొనుగోలు చేశారు. పూర్ణామార్కెట్‌లో అన్నిరకాలు వస్తువులు అందుబాటులో ఉంటాయన్న ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పోటెత్తారు. మెయిన్ రోడ్డు నుంచి కురుపాం మార్కెట్ వరకు, దుర్గాలమ్మ గుడి రోడ్డు పూర్తిగా రద్దీగా మారాయి.


గాజువాకలో ఏర్పాటు చేస్తున్న 89 అడుగుల భారీ వినాయక విగ్రహం

## శిక్షల భయం లేకనే మహిళలపై అకృత్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న పౌర చైతన్య వేదిక నాయకురాలు ప్రమీల

**సీతంపేట, సెప్టెంబరు 6:** కఠిన శిక్షలు పడతాయన్న భయం లేనందునే వయసు తారతమ్యం లేకుండా మహిళలపై అత్యాచారాలు, హత్యలకు ఒడిగడుతున్నారని పౌర చైతన్య వేదిక నాయకురాలు సీహెచ్ ప్రమీల ఆక్రోశించారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రమీల మాట్లాడుతూ కోల్‌కత్తాలో జరిగినలాంటి దుస్సంఘటనలపై ప్రజలు సంఘటితమై పోరాడినప్పుడే నేరస్థులకు శిక్షలు పడే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రొఫెసర్ కోల వెన్ను మాట్లాడుతూ మహిళలపై అమానుష ఘటనలకు మద్యం, డ్రగ్స్, పోర్న్ సైట్స్, సినిమాలలో మితిమీరిన హింస చూపించడమే కారణమని ఆరోపించారు. యువత భయం వీడి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, పౌర చైతన్య వేదిక నాయకులు ఎస్.గోవిందరాజులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# నీరు-చెట్టు బకాయిలు విడుదల

**ప్రస్తుతం రూ.3.49 కోట్లు విడుదల, కోర్టుకు వెళ్లిన వారికి తొలి ప్రాధాన్యం**

**2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో రూ.44.5 కోట్లతో 715 పనులకు బిల్లులు**

**పెండింగ్‌లో పెట్టిన వైసీపీ సర్కారు కూటమి ప్రభుత్వం రాకతో మంజూరు**

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం ప్రభుత్వ హయాం(2014-2019)లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం తాజాగా రూ.3,49,67,926 మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బిల్లుల కోసం కోర్టుకు వెళ్లిన వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. కోర్టుకు వెళ్లినా గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కొందరు హైకోర్టులో ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు ధిక్కారణ పిటిషన్లు వేసిన వారికి తొలుత బిల్లులు ఇవ్వాలని, తదుపరి కోర్టును ఆశ్రయించిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా చోడవరం కేంద్రంగా పనిచేస్తున్న వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ డివిజన్‌లో 15 పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఏడుగురికి రూ.1,13,28,113, కోర్టును ఆశ్రయించిన మరో ఐదుగురికి రూ.37,26,309 విడుదల చేశారు. అలాగే నర్సీపట్నం రెగ్యులర్ డివిజన్ పరిధిలో 19 పనులకు కోర్టు ధిక్కారణ పిటిషన్లు చేసిన ఎనిమిది మందికి రూ.1,50,54,422, పాడేరు చిన్ననీటి పారుదల డివిజన్ పరిధిలో రెండు పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఇద్దరికి రూ.27,57,533 విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో నీరు-చెట్టు కింద 2019 వరకు రూ.44.5 కోట్ల విలువైన 715 పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు బిల్లులు ఇవ్వలేదు సరికదా రెండు, మూడు పర్యాయాలు విచారణ చేపట్టింది. ఆ తరువాత కూడా బిల్లుల విషయం తేల్చకపోవడంతో పలువురు కోర్టుకు వెళ్లారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారిలో ఎక్కువ మంది కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 89 పనులకు రూ.7.7 కోట్లు విడుదల చేసినా సీఎంఎఫ్ఎస్‌లో బిల్లులు పూర్తిగా రాలేదని చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల విషయం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అన్ని జిల్లాలకు కలిపి రూ.200 కోట్లు విడుదల చేయగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 41 పనులకు రూ.3.49 కోట్లు మంజూరుచేశారు. త్వరలో సొమ్ములు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాకు జమ కానున్నాయి. మిగిలిన పనులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

## శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో ప్రత్యేక రైళ్లకు హాల్ట్

**విశాఖపట్నం, సెప్టెంబరు 6:** ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, తంబరం-సంత్రాగచ్చి మధ్య ప్రవేశ పెడుతున్న ప్రత్యేక రైళ్లకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో రెండు నిమిషాలపాటు హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06089 నంబరు గల చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి రైలు ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో 06090 నంబరు గల సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ రైలు మధ్యాహ్నం 2.05 గంటలకు, 06095 నంబరు గల తంబరం-సంత్రాగచ్చి రైలు ఉదయం 5.00 గంటలకు, తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి-తంబరం రైలు మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌కు చేరుతాయని పేర్కొన్నారు. దువ్వాడ మీదుగా హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను యశ్వంతపూర్ వరకు పొడిగించామన్నారు. ఈ నెల 25 నుంచి హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ (22831/22832) సర్వీసులుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

## వినాయక పందిళ్లకు 44 దరఖాస్తులు

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** నగరంలో వినాయక చవితి పందిళ్లకు అనుమతి కోసం ఆఫ్‌లైన్‌లో శుక్రవారం 44 దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక చాంబర్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 వరకు దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను పోలీస్ కమిషనరేట్‌కు పంపిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆఫ్‌లైన్‌లో గతనెల 27 నుంచి ఈనెల 3వ తేదీ వరకు 111 దరఖాస్తులు రాగా కమిషనరేట్‌కు పంపారు. తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ సరిగ్గా పనిచేయకపోవడం, ఇతరత్రా ఇబ్బందులు ఉండడంతో గురువారం నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తం 194 దరఖాస్తులు వచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## కేజీహెచ్‌లో నగర పోలీసులకు వైద్య పరీక్షలు



పోలీసులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**మహారాణిపేట, సెప్టెంబరు 6:** పోలీసు సిబ్బందికి కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. సీపీ శంకబ్రత బాగ్చి ఆధ్వర్యంలో శుక్రవారం కేజీహెచ్‌లో సుమారు 3,500 మంది నగర పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ నెల 10 వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలు ఉంటే చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. మద్య వ్యసనానికి అలవాటు పడిన కొందరు హోంగార్డులకు డి ఆడిక్షన్ సెంటరు ద్వారా చికిత్స చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## మార్కెట్‌కు చవితి కళ

... 3వ పేజీ తరువాయి

వినియోగించే పత్రి రూ.20-30, కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50, అరటి పండ్లు డజను రూ.80కు విక్రయించారు. పూజ కోసం ప్రత్యేకంగా కొనుగోలు చేసే ఎలక్కాయ, సీతాఫలం వంటివి ఒక్కొక్కటి రూ.పది నుంచి రూ.30 చొప్పున విక్రయించారు. ఇంట్లో పూజకు వినియోగించే చిన్న సైజు వినాయక మట్టి ప్రతిమలు రూ.50 నుంచి రూ.250, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు రూ.200 నుంచి రూ.500 మధ్య విక్రయాలు సాగించారు. కొన్నిచోట్ల పూజకు అవసరమైన సామగ్రి మొత్తాన్ని సెట్‌గా రూ.350 నుంచి రూ.500కు ఇచ్చారు. గతంతో పోలిస్తే ఇంట్లో వినియోగించే చిన్నపాటి విగ్రహాల విక్రయాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో 100 నుంచి 150 బొమ్మలు విక్రయిస్తే, ఈ ఏడాది గురు, శుక్రవారాల్లో 200కుపైగా విక్రయించినట్టు రామారావు అనే వ్యాపారి తెలిపారు. మరో 100 వరకు బొమ్మలు అమ్ముడుపోతాయని తెలిపారు.

## మధ్య తరగతికి గృహ నిర్మాణం

... 3వ పేజీ తరువాయి

ఏర్పాటుచేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణులతో అధ్యయనం చేయిస్తున్నామని, వారు సూచించిన ప్రాంతంలో దానిని ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి నిధులు రాబట్టుకునే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని పురపాలక శాఖా మంత్రి సూచించిన నేపథ్యంలో కోతకు గురవుతున్న తీర ప్రాంతాన్ని సంరక్షించుకోవడానికి రూ.200 కోట్లు కోరుతూ కేంద్రానికి లేఖ రాశామన్నారు. అయితే ఇప్పటికే ఇదే పథకం కింద ఉప్పాడ తీరానికి నిధులు మంజూరు చేశామని, రెండో దశలో విశాఖకు ఇస్తామని సమాధానం వచ్చిందన్నారు.

## ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్

... 3వ పేజీ తరువాయి

చెప్పారు. లక్ష్య సాధన కోసం ఫిషరీస్ రంగాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. రొయ్యల ఎగుమతులు మరింత పెంచడానికి న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్లపై దృష్టిపెట్టామని, వీటి కోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఐదు రోజుల క్రితమే 218 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామన్నారు. మత్స్య రంగానికి గత ఏడాది కంటే ఈ ఏడాది 54 శాతం అధికంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. ఒక్క పీఎంఎస్ఎస్‌వై కిందే ఈ ఏడాది రూ.2,352 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. సమావేశంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఇలియాస్, అధ్యక్షులు రవికుమార్ ఎల్లంకి, ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పీఆర్ మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## 'అవకాశాలను సద్వినియోగం చేసుకోండి'

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 :** విశాఖ పోర్టు అథారిటీ, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా ఇచ్చిన నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన 4, 5 బ్యాచ్‌ల విద్యార్థుల్లో ఉద్యోగాలు పొందిన వారికి శుక్రవారం ఆయన పోర్టు పరిపాలనా భవనం మంథన్ మందిరంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్‌లుగా పలువురు విద్యార్థులు చెన్నై, హైదరాబాద్‌లో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఉద్యోగాలు పొందడం పట్ల సెమ్స్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ, సెమ్స్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రేటర్ టెండర్లలో అక్రమాలు

... 3వ పేజీ తరువాయి

చర్చనీయాంశంగా మారింది. ఒకే రకమైన పనికి ఒకే ఖర్చుతో టెండర్ పిలవాల్సిన అధికారులు, రెట్టింపు వ్యయంతో టెండర్ పిలవడం ఏమిటనే దానిపై చర్చ జరిగింది.విషయం ఉన్నతాధికారి దృష్టికి చేరడంతో టెండర్ ప్రక్రియను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. నీటి సరఫరా విభాగంలో ఇలాంటి అవకతవకలు బోలెడు జరుగుతున్నాయి. వీటిపై జీవీఎంసీ కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంది.


డాబా గార్డెన్స్‌లో ఎస్‌టీయూ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయుడ్ని సన్మానించారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

## 10న ఉక్కు పరిరక్షణ రాస్తారోకో

**జగదాంబ కూడలి, సెప్టెంబరు 6 :** ఉక్కు పరిరక్షణ కోసం 10న జిల్లాలో సీటు ఆధ్వర్యంలో పలుచోట్ల రాస్తారోకోలు తలపెట్టినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ వెల్లడించారు. శుక్రవారం జగదాంబ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కుకు సొంత బొగ్గు గనులు కేటాయించాలని కోరుతూ పోరాట కమిటీ 10న ఉదయం 10 గంటల నుంచి 11 వరకు రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపు ఇచ్చిందన్నారు.

## 'విజ్ఞాన జ్యోతి'కి పది మంది బాలికల ఎంపిక

**కొమ్మాది, సెప్టెంబరు 6 :** రిక్షా కాలనీలోని గురుకుల ప్రతిభా పాఠశాల నుంచి ఈ ఏడాది కూడా విజ్ఞాన జ్యోతి కార్యక్రమానికి 10 మంది బాలికలు ఎంపికయ్యారని ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపవతి అన్నారు. శుక్రవారం ఆమె పాఠశాలలో ఎంపికైన బాలికలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపికైన వారికి కేంద్రం నీట్, ఐఐటీ, ఎంసెట్ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు రూ. 10 వేల విలువ గల పుస్తకాలు, రూ. 12 వేల చొప్పున స్కాలర్ ఇస్తుందన్నారు.

## సోలార్ విద్యుత్‌పై అవగాహన

**ఆనందపురం, సెప్టెంబరు 6 :** మండలంలోని బోని గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు సోలార్ రూఫ్ టాప్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరగడం వల్ల సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోలార్ వినియోగంపై దృష్టిసారించాలన్నారు.

## ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

**సింహాచలం, సెప్టెంబరు 6 :** వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవాలయం నాల్గవ తరగతి ఉద్యోగి బలిరెడ్డి సన్యాసిరావును సస్పెండ్ చేస్తూ ఈఓ శ్రీనివాసమూర్తి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో మద్యం సేవించాడని, భక్తులతో దురుసుగా ప్రవర్తించాడన్న ఆరోపణలపై దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ ఇచ్చిన నివేదిక మేరకు ఈఓ ఆయన్ను సస్పెండ్ చేశారు.

## అప్పన్న ఆలయ ఉద్యోగులు విరాళం

**సింహాచలం, సెప్టెంబరు 6 :** విజయవాడలోని వరద బాధితులకు అప్పన్న ఆలయ ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఒకరోజు మూల వేతనం వరద బాధితులకు అందించాలని నిర్ణయించుకున్నట్టు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తికి తమ సమ్మతిని తెలియజేశారు. ఈమేరకు ఉద్యోగుల ఒకరోజు వేతనం రూ. 3,66,406 చెక్కును త్వరలోనే కమిషనర్‌కు అందజేయనున్నారు.

## సీఎం సహాయ నిధికి రూ. లక్ష

**పద్మనాభం :** పాండ్రంగి గ్రామానికి చెందిన ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్స్ అధినేత, టీడీపీ నాయకుడు రామరాజు వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష విరాళాన్ని సీఎం సహాయ నిధికి పంపించారు. ఈమేరకు విరాళం చెక్కును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

## సీపీఐ విరాళాల సేకరణ

**మధురవాడ :** వరద బాధితులను ఆదుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు కోరారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయులు సత్యనారాయణ, ఎండీ బేగం, బంగారయ్య, త్రినాథ్ పాల్గొన్నారు.

## రుషికొండలో సినిమా షూటింగ్

**సాగర్‌నగర్, సెప్టెంబరు 6 :** నారా రోహిత్ హీరోగా తెరకెక్కుతున్న సుందరాకాండ సినిమా షూటింగ్ శుక్రవారం రుషికొండలోని గీతం వర్సిటీ ఆవరణలో జరిగింది. సందీప్ పిక్చర్స్ ప్యాలెస్ పతాకంపై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరోయిన్‌గా శ్రీదేవి నటిస్తుండగా సంతోష్, గౌతమ్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రామ్‌నగర్‌లో మట్టి బొమ్మలను పంపిణీ చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

# మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

**విగ్రహాల పంపిణీలో ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి, వంశీకృష్ణ**

**మధురవాడ, సెప్టెంబరు 6 :** పర్యావరణ పరిరక్షణకు అందరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన మిథిలాపురి కాలనీలో ఉత్తరాంధ్ర ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా పర్యావరణహితంగా పండగ జరుపుకోవాలన్నారు. మట్టి ప్రతిమలతో పూజ చేయడం వల్ల జల కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్ళా వెంకటరావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

**సింహాచలం :** ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో 98వ వార్డు ప్రజలకు సుమారు 500 గణపతి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ నేత, ట్రస్టు సభ్యుడు కర్రి సత్తిబాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత బంటుబిల్లి మహేష్, బోర ప్రసాద్‌రెడ్డి, మజ్జి ధర్మరాజు, ఆకుల నాగరాజు, సిరిపురపు కృష్ణ, లండ రమణ, శిరిపురపు తాతబాబు పాల్గొన్నారు. సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో సింహగిరిపై దుకాణాల సముదాయం వద్ద మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్‌బాబు, సభ్యులు పైడిరాజు, దొంతల శంకర్, సురేష్, కస్తూరి సత్తిబాబు పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** పట్టణంలోని మెయిన్ రోడ్డులో వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నర్సింగరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖుడు గుగ్గిళ్ల వెంకట లక్ష్మీ నరసింహ శాస్త్రి (పండు), కదిరి జగన్నాథం, కోశాధికారి పిల్లి శ్రీను, గురుస్వామి వేణు, నాయకులు కోలా చంద్రశేఖర్, కె. ముత్యాలరావు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజిస్ట్రేట్ నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, కోశాధికారి ఎం. సునీల్ పాల్గొన్నారు.

**ఆనందపురం :** మండలంలోని పలు గ్రామాల్లో శుభబలరాం సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. వెల్లంకి, పెద్దిపాలెం, ఆనందపురం, వేములవలస, గొట్టిపల్లి గ్రామాల్లో సుమారు 1500 ప్రతిమలను పంపిణీ చేశామని సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్ చెప్పారు. వేములవలస జంక్షన్‌లో రామ్‌జీ సెట్ పాయింట్ ఆధ్వర్యంలో వెయ్యి విగ్రహాలను అందజేశారు.

**వెంకోజీపాలెం :** జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో జనసేన నాయకులు వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కేఎస్ఆర్ టీం అండ్ జనసేన నాయకులు సాయిబాబా ఆధ్వర్యంలో కాలనీవాసులందరికీ వీటిని అందజే శారు. కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షురాలు కళ యడ్లపూడి, టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, రవికుమార్, శంకర్ పాల్గొన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విశాఖపట్నం వారి సౌజన్యంతో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ఉద్యోగులకు, ప్రజలకు 600 మట్టి ప్రతిమలను అదనపు కమిషనర్ రమణమూర్తి, యూసీడీ ఎంపీడీ ఫణిరామ్ పంపిణీ చేశారు.

**ఎంవీపీ కాలనీ :** గొడుగు వాకర్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ వాల్తేర్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. శివాజీ పార్కులో 250 మందికి వీటిని అందించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రాంతీయ అధికారి ముకుంద్, ప్రొఫెసర్ ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

**సిరిపురం :** ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జీవీఎంసీ సమీపంలోని వేమన మందిరంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**కొమ్మాది :** పీఎం పాలెం కాలనీలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యార్లగడ్డ జీవన్,మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, గొల్లంగి ఆనందబాబు, మన్యాల సోంబాబు, పోతిన శివ, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

**రామ్‌నగర్ :** రామ్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయం సమీపంలో భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు వేల మట్టి ప్రతిమలు, రెండు వేల తులసి మొక్కలు,వినాయక వ్రత పుస్తకాలను పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీషా చేతుల మీదుగా వీటిని అందజేశారు. అలాగే సదరన్ ఇంటర్నేషన్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రతిమలు పంపిణీ చేశారు.

**భీమునిపట్నం (రూరల్) :** మండలంలోని పలు గ్రామాల్లో దివీస్ కంపెనీ ప్రతినిధులు ఆరు వేల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ రావు, డీజీఎం బాలాజీ పాల్గొన్నారు.

**పద్మనాభం/రూరల్ :** పాండ్రంగి ఉన్నత పాఠశాలలో వీవీజీ ఛారిటబుల్ ట్రస్టు తరఫున నాయుడు 200 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అలాగే రేవిడిలో శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలోనూ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

## బీజేపీకి 20 కోట్ల సభ్యత్వాలు : కేంద్ర మంత్రి



మాట్లాడుతున్న మంత్రి కురియన్

**పెదవాల్తేరు, సెప్టెంబరు 6 :** నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా మైనారిటీల సభ్యత్వ నమోదును కేంద్ర మైనారిటీ శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే 20 కోట్లకు పైగా సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అన్నారు. ప్రపంచ దేశాలు నేడు భారత్ వైపు చూడడానికి ప్రధాన కారణం ప్రధాని మోదీ అని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా సభ్యత్వ నమోదు కన్వీనర్ షబ్బీర్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్రనగర్ పార్క్ అభివృద్ధికి చర్యలు

**మధురవాడ, సెప్టెంబరు 6 :** జీవీఎంసీ ఏడో వార్డు స్వతంత్రనగర్ కాలనీలో ఉన్న పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన జనసేన, టీడీపీ నాయకులతో కలిసి పార్కును పరిశీలించారు. పార్కులో నరికిన చెట్ల మొదళ్లను అలాగే ఉంచడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు, పగోడాలు, టాయిలెట్లు తదితర వాటిని పరిశీలించారు. టాయిలెట్లకు తాళాలు వేసి ఉంచడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటే వాటిని సందర్శకులు ఎలా ఉపయోగిస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. పార్కు ఆధునికీకరణ, లైటింగ్, తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## 'వైసీపీ కొత్త నాటకాలు'

**భీమునిపట్నం, సెప్టెంబరు 6 :** అధికారం కోల్పోవడంతో వైసీపీ నాయకులు కొత్త నాటకాలు మొదలు పెట్టారని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాడు చిన్నికుమారిలక్ష్మి విమర్శించారు. శుక్రవారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో వుండగా అడ్డగోలుగా ఆస్తి పన్ను పెంపుదల చేశారని దుయ్యబట్టారు. టీడీపీ, జనసేన, వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా పట్టించుకోకుండా చెత్త పన్ను సేకరణ అమలు చేశారని చెప్పారు. తీరా అధికారం కోల్పోవడంతో మొసలి కన్నీరు కారుస్తూ చెత్త పన్ను రద్దు చేయాలని వినతి పత్రాలు అందిస్తున్నారని మండిపడ్డారు.

## చినగదిలిలో నేత్ర వైద్య శిబిరం

**ఆరిలోవ, సెప్టెంబరు 6 :** చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వంద మంది రోగులను పరీక్షించి, 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రాజు, వైద్యులు వివేక్, వర్మ, నరసింగ్, అసిస్టెంట్ ఆదిలక్ష్మి, సాయిబాబా ఆలయం చైర్మన్ వానపల్లి అప్పారావు, కార్యదర్శి పాత్రో, మంగరాజు, ఉంగరాల శ్రీను పాల్గొన్నారు.

## ఎన్ఎంయూ రిలే దీక్షలు

**పెదవాల్తేరు, సెప్టెంబరు 6 :** వాల్తేరు డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ.. నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రిలే దీక్షలు చేపట్టారు. వీటిని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి మోహన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా డిపో మేనేజర్ వైఖరిపై శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తున్నా..యాజమాన్యం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. విశాఖ డీపీటీఓ ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.



బిస్కెట్లు పంపిణీ చేసిన పత్రాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి అందిస్తున్న అపాటా ప్రతినిధులు

## ప్రత్యేక కార్గో విమానాలు నడపాలని వినతి

**విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** విశాఖ విమానాశ్రయం నుంచి ప్రత్యేక కార్గో విమాన సర్వీసులు నడపాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ (అపాటా) ఆ శాఖ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కోరింది. ఈమేరకు అపాటా ప్రతినిధులు కుమార్ రాజా, ఓ. నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ శుక్రవారం ఇక్కడి విమానాశ్రయంలోని ప్రత్యేక కార్యక్రమంలో మంత్రిని కలిసి మాట్లాడారు. నైట్ పార్కింగ్ అందుబాటులోకి తేవాలని, గతంలో నడిచి రద్దయిన విమానాలను పునరుద్ధరింపజేయాలని కోరారు. అలాగే విశాఖపట్నం-భోగాపురం మధ్య 12 ఫ్లైఓవర్లు మంజూరయ్యాయని, బీచ్ కారిడార్ కూడా మంజూరైందని వాటి పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. అరకు కాఫీని ప్రమోట్ చేయడానికి అన్ని విమానాశ్రయాల్లో అరకు కాఫీ కౌంటర్లు పెట్టించాలని సూచించారు. అనంతరం విజయవాడలో వరద బాధితులకు 50 వేల బిస్కెట్ ప్యాకెట్లను అపాటా ప్రతినిధులు పంపించారు. వాటికి సంబంధించిన పత్రాలను మంత్రికి అందజేశారు.



## 'ఎమర్జెన్సీ' సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ మంజూరు చేయాలి

**సిరిపురం, సెప్టెంబరు 7 :** ఎమర్జెన్సీ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ వెంటనే మంజూరు చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కంగనా రనౌత్‌కు మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జన జాగరణ కన్వీనర్ వాసు, నాయకులు శంకర్, సీతన్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై విమర్శలు సరికాదు : బీవీ రామ్

**భీమునిపట్నం, సెప్టెంబరు 6 :** ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ లేనిపోని విమర్శలు చేయ డం సరికాదని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. శుక్రవారం ఆయన భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అసమర్థ పాలన వల్లే బుడమేరు ముంపు సంభవించిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వరద బాధితులకు రూ. 6 కోట్లు విరాళం ప్రకటిస్తే, జగన్ కేవలం రూ. కోటి ప్రకటించడం విడ్డూరంగా వుందన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన

**ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 6 :** ఎంవీపి కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో శుక్రవారం బయోకెమిస్ట్రీ విభాగం విద్యార్థులు పౌష్టికాహార ప్రాధాన్యతపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆచార్య ప్రగడ రాజ గణపతి ఈ ప్రదర్శనను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వీఎస్ఆర్ కృష్ణప్రసాద్, కళ్యాణ్ రావాడ, గిరిధర్, సుష్మాచంద్ర, డాక్టర్ ఇలాహీ షేక్ పాల్గొన్నారు.

## కమనీయం... సింహాద్రినాథుడి నిత్య కల్యాణం

**సింహాచలం, సెప్టెంబరు 6 :** వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## వాయు కాలుష్యం నియంత్రణపై అవగాహన అవసరం

**వెంకోజీపాలెం, సెప్టెంబరు 6 :** వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యం, జీవన విధానంపై తీవ్ర ప్రభావితం కలిగిస్తుందని, దీనిపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ సమావేశ మందిరంలో జీవీఎంసీ, కాలుష్య నియంత్ర మండలి సంయుక్తంగా వాయు కాలుష్యం నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయు కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీరు వినయ్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కలసి ఉంటే.. నాటిక

**మద్దిలపాలెం, సెప్టెంబరు 6 :** పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన కలసి ఉంటే నాటిక అలరించింది.భార్యభర్తల మధ్య ఇగోలతో సమస్యలు తెచ్చుకుంటున్నారని, కలసి ఉంటే కలదు సుఖమన్న సందేశంతో హాస్యభరితంగా సాగిన నాటిక ఆద్యంతం రక్తి కట్టించింది. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, నాటిక దర్శకుడు డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాట్ల ధ్వంసంపై ఇరువర్గాల ఫిర్యాదు



ధ్వంసం చేసిన రోడ్డును పరిశీలిస్తున్న ప్లాట్ల యాజమానులు

**భీమునిపట్నం, సెప్టెంబరు 6 :** బీచ్‌రోడ్ నేరేళ్లవలసలో రాత్రికి రాత్రి వుడా లే అవుట్‌ను జేసీబీతో ధ్వంసం చేసి ఎనిమిది ప్లాట్ల స్థలాలను హైదరాబాద్, బెంగళూరుకు చెందిన సంస్థలు స్వాధీనం చేసుకున్న ఉదంతమిది. నేరేళ్లవలసలో గృహ జ్యోతి బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ ప్రై లిమిటెడ్ సుమారు 11.81 ఎకరాల్లో రెడ్ హిల్స్ ఫామ్స్ పేరుతో వుడా లే అవుట్ వేశారు. దీనికి వుడా ఎల్‌పి నెం.56/2004 వుంది. ఈ లేఅవుట్‌లో గురువారం రాత్రి కొందరు వ్యక్తులు జేసీబీతో ఎనిమిది ప్లాట్ల స్థలాల ప్రహరీలను తొలగించారు. లే అవుట్‌లో వున్న బిటి రోడ్‌ను కూడా తవ్వి, ట్రంచ్ ఏర్పాటు చేశారు. ఆయా ప్లాట్లలో ఒక వాచ్‌మేన్ యజమానులకు తెలియజేయడంతో శుక్రవారం వారు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసిన ప్రదేశంలో ఒక చెట్టుకు హైదరాబాద్‌కు చెందిన మిస్సర్స్ శ్రీ శివ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరుకు చెందిన మిస్సర్స్ సిట్రాస్ ఎస్టేట్స్ తరపున ప్రతినిధిగా బాలా ఈశ్వర సత్యవతమ్మ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లుగా బోర్డు ఏర్పాటు చేశారు. ఆ భూమి తమదని, ఎవరూ ప్రవేశించడం నిషేధమని పేర్కొన్నారు. ఈ విషయమై సీఐ సుధాకర్ మాట్లాడుతూ ప్లాట్ల యజమానులు కళ్లేపల్లి అనురాధ, మూర్తి తరపున ప్లాట్ సూపర్‌వైజర్ శివకృష్ణ, మోహన్‌కృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. రెండో పార్టీ తరఫున కూడా ఒక మహిళ, ఇద్దరు న్యాయవాదులు వచ్చి కలిసారన్నారు. రెవెన్యూ అధికారులను సంప్రతించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా లేఅవుట్‌లో ఆరు నెలలు క్రితం జీవీఎంసీ నిధులతో బీటీ రోడ్‌ను నేరేళ్లవలస కాలనీకి కలుపుతూ నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డును ధ్వంసం చేశారు. ఈ విషయమై భీమిలి పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్ మాట్లాడుతూ సమాచారం అందిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**MVP కాలనీ-2 బ్రాంచ్ (10461)**
ఎ.ఎస్. రాజా జూ॥ ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా, సెక్టార్-10, MVP కాలనీ, విశాఖపట్నం-530017.

**[రూల్ 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విశాఖపట్నం అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, అందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ 30.05.2024 వ తేదీన జారీచేసిన డిమాండ్ నోటీసు మీకు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన సదరు బకాయి రూ. 6,36,143.19/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై ఆరు వేల నూట నలభై మూడు రూపాయలు మరియు పంతొమ్మిది పైసలు) మొత్తమును తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/హామీదారులు అయిన శ్రీ దోడిశెట్టి శ్రీరామ్ గారిని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారులు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని తేది 03.09.2024న స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీతలు/హామీదారులు & ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించి ఏట్టి లావాదేవీలు జరిపిన అవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, MVP కాలనీ-2 బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బకాయి రూ.6,36,143.19/- (అక్షరాల ఆరు లక్షల ముప్పై ఆరు వేల నూట నలభై మూడు రూపాయలు మరియు పంతొమ్మిది పైసలు) + వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సదరు చట్టం సందలి సెక్షన్ 13(8) ప్రకారం, సెక్యూర్డ్ ఆస్తులను లీజు, అప్పగించుట లేదా విక్రయించుట ద్వారా బదిలీచేయుట కొరకు బహిరంగ వేలం లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్లు కోరుట లేదా ప్రైవేటు ఒప్పందం కొరకు అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకు ముందుగా ఏ సమయంలోనైనా పైన తెలిపిన మొత్తంతో పాటు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు మాకు సంభవించిన వ్యయాలు అన్నింటినీ చెల్లించి సెక్యూర్డ్ ఆస్తులను మీరు విడిపించుకోవలసినదిగా కోరడమైనది.

**స్థిరాస్తి వివరములు:**
(యలమంచిలి ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 89/2015 ప్రకారం శ్రీ దోడిశెట్టి శ్రీరామ్ పేరున గల ఆస్తి): విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, దుప్పితూరు గ్రామం, ఎస్.నెం. 50/2, 51/2, 52, 55, ప్లాట్ నెంబ.57, 58, 74 & 75, ఎల్.పి.నెం. 4/2013 ద్వారా ఉడా ఆమోదించిన లేఅవుట్ (క్రాంతి ప్యారడైజ్), మొత్తము 1111.11 చ॥గ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం వాటా 37.03 చ॥గ॥ లేదా 30.96 చ॥మీ॥. స్థలానికి హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం. 59, దక్షిణం: 40 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం.56, ఉత్తరం: 40 అ॥ వెడల్పు రోడ్డు.
"జోగేశ్వర్ సదన్" మూడవ అంతస్తులోని సూపర్ బిల్టప్ ఏరియా 955 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు మరియు బాల్కనీలు కలుపుకొని) మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోని కారు పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥ గల ఫ్లాట్ నెం. 404. మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 404కు హద్దులు: తూర్పు: సెట్‌బ్యాక్ లేదా శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఫ్లాట్ నెం. 56, ఉత్తరం: ఫ్లాట్ నెం. 401, పైన: ఫ్లాట్ నెం.501, క్రింద: ఫ్లాట్ నెం. 301.

తేది: 03.09.2024
ప్రదేశం: విశాఖపట్నం
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
మహారాణిపేట బ్రాంచ్, 18-01-26, కెజిహెచ్ డౌన్, మహారాణిపేట, విశాఖపట్నం. ఫోన్: 0891-2546773.

**[రూల్ 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం నెం. 54/2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహారాణిపేట బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, అందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ 29.04.2024 వ తేదీన జారీచేసిన డిమాండ్ నోటీసు మీకు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన సదరు బకాయి రూ. 44,20,693.85 (అక్షరాల నలభై నాలుగు లక్షల ఇరవై వేల ఆరు వందల తొంభై మూడు రూపాయలు మరియు ఎనభై ఐదు పైసలు) మొత్తమును తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీత: M/s. సాయి గౌరవిత్రీ ఆటోమోటివ్స్, పార్టనర్ మరియు హామీదారులు వారిని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు/పార్టనర్లు/హామీదారులు/చట్టబద్ధమైన వారసులు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని తేది 05.09.2024న స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీత మరియు హామీదారులు & ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు, చట్టబద్ధమైన వారసులు, కో-ఆబ్లిగెంట్స్‌లను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించి ఏట్టి లావాదేవీలు జరిపిన అవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహారాణిపేట బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బకాయి రూ.44,20,693.85 + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సదరు చట్టం సందలి సెక్షన్ 13(8) ప్రకారం, సెక్యూర్డ్ ఆస్తులను లీజు, అప్పగించుట లేదా విక్రయించుట ద్వారా బదిలీచేయుట కొరకు బహిరంగ వేలం లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్లు కోరుట లేదా ప్రైవేటు ఒప్పందం కొరకు అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకు ముందుగా ఏ సమయంలోనైనా పైన తెలిపిన మొత్తంతో పాటు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు మాకు సంభవించిన వ్యయాలు అన్నింటినీ చెల్లించి సెక్యూర్డ్ ఆస్తులను మీరు విడిపించుకోవలసినదిగా కోరడమైనది.

**స్థిరాస్తి వివరములు:**
ఆస్తి-1: విశాఖపట్నం జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, మధురవాడ ఎస్.ఆర్.ఓ., యండాడ గ్రామం, సర్వే నెం. 23/2 భాగం మొత్తం 888 చ॥గ॥ లలో అనిర్దేశపు మరియు అవిభాజ్యపు స్థలం 59.2 చ॥గ॥ లేదా 49.498 చ॥మీ॥ వాటాతో "వరాహ లక్ష్మి నరసింహా ప్యారడైజ్" మొదటి అంతస్తులో 1600 చ॥అ॥ విస్తీర్ణం (ఉమ్మడి ఏరియాలతో కలుపుకొని) గల ఫ్లాట్ నెం. 201. అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: సుబ్రహ్మణ్యం స్థలము, పడమర: బంగార్రాజు అమ్మిన స్థలము, ఉత్తరం: కె. శ్రీనివాసు స్థలము. మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.201 హద్దులు: తూర్పు: ఖాళీ ప్రదేశం, దక్షిణం: ఖాళీ ప్రదేశం, పడమర: ఫ్లాట్ నెం. 202, ఉత్తరం: ఉమ్మడి వరండా.
ఆస్తి-2: విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం రిజిస్ట్రేషన్-సబ్ జిల్లా, భీమునిపట్నం మండలం, చిప్పాడ గ్రామం, సర్వే నెం. 173/1, ఖాతా నెం. 431, మొత్తం ఎ. 0.49 ½ సెంట్లు లేదా 0.197 హెక్టార్లు లేదా 2408 చ॥గ॥ లేదా 2023 చ॥మీ॥ విస్తీర్ణంలోని భూమి. హద్దులు: తూర్పు: ఎస్.ఎస్.పి. రాజు భూమి, దక్షిణం: పేరాడ తిలక్ భూమి, పడమర: దివీస్ కంపెనీ భూమి, ఉత్తరం: దివీస్ కంపెనీ భూమి.

తేది: 05.09.2024
ప్రదేశం: విశాఖపట్నం
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా